క్లుప్తంగా

మిస్సింగ్ కేసు నమోదు



వెంకటేశ్వర్లు

వేలేరు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై అజ్మీరా సురేశ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరుకు చెందిన సింగం వెంకటేశ్వర్లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవాడు. వెంకటేశ్వర్లు ఈనెల 6న ఉదయం బస్టాండ్‌కు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. వెంకటేశ్వర్లు భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీకాంతకు నివాళి



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు కందగట్ల ప్రకాశ్ తల్లి లక్ష్మీకాంత బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సామల మధుసూదన్, గౌరవ అధ్యక్షుడు వావివాల వేణుగోపాల్ ప్రసాద్ వారి నివాసాన్ని సందర్శించి లక్ష్మీకాంత మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో ప్రధాన కార్యదర్శి సామల రవీందర్, బాసని సదాశివుడు, దాసి శ్రావణ్ కుమార్, దాసరి కుమారస్వామి, మామిడి వెంకటేశ్వర్లు, కుసుమ రమేష్, కందగట్ల హరికృష్ణ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రంగు రామచంద్రం, భట్టు వెంకటయ్యలు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర తనయుడు ఇమ్మానియేల్ రాజ్ బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తెల శ్రీకాంత్, ప్రభాకర్, గిరిబాబు, సుధాకర్, బాపిరెడ్డి, అంజయ్య, సాగర్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

ఆత్మకూరు : మనస్తాపంతో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొత్తగట్టు శివారులో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దామెర మండలం సింగరాజుపల్లెకు చెందిన కన్న పోచయ్య(65) ఆదివారం గృహ ప్రవేశం విషయంలో భార్య నర్సమ్మతో గొడవ పడ్డాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం కొత్తగట్టు శివారులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై సతీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

సంగెం : వివాహిత అదృశ్యమైన ఘటన కాట్రపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన కొత్తూరు రమ, రాజుల చిన్న కూతురు స్వాతిని (20), సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన వర్కాల రవీందర్‌తో ఈ ఏడాది ఏప్రిల్ 23న వివాహం చేశారు. పెళ్లి అయిన నెల వరకు సజావుగానే ఉన్న దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. డబ్బులు కావాలంటే స్వాతి తల్లిదండ్రులు రూ.60 వేలు అప్పుగా ఇప్పించారు. తర్వాత అత్త, మామలు ఓర్వడం లేదని చెప్పుకుంది. ఈ నెల 12న వరంగల్‌లోని ఏఎస్ఎం కళాశాల సమీపంలో గల బేకరిలో రవీందర్, పక్కనే ఉన్న ఐస్‌క్రీం పార్లల్‌లో స్వాతి పనికి వెళ్లారు. అక్కడ భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో స్వాతి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఈ విషయం తల్లిగారికి చెప్పడంతో కాట్రపల్లికి వచ్చి అల్లుడిని అడిగితే ఎక్కడ చచ్చిందో చూసుకోమని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. ఎక్కడ వెతికినా జాడలేదని స్వాతి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని వివరించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సంగెం పోలీస్ స్టేషన్ 87126 85029, ఎస్సై 87126 85243 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సింగిల్ రోడ్లు.. ఆపై గుంతలు



కమలాపూర్ నుంచి దేశరాజుపల్లికి వెళ్లే మార్గంలో ఏర్పడిన పెద్ద గుంతలు



కమలాపూర్ నుంచి కన్నూరుకు వెళ్లే రోడ్డుపై గుంతలు

- పూర్తిగా దెబ్బతిన్న రహదారులు
- ప్రయాణించాలంటే జంకుతున్న జనం
- డబుల్ రోడ్లుగా విస్తరించాలంటున్న వాహనదారులు, ప్రయాణికులు

కమలాపూర్ : కమలాపూర్ నుంచి దేశరాజుపల్లికి, కమలాపూర్ నుంచి కన్నూరుకు వెళ్లే మార్గాల్లోని రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయమయ్యాయి. మోకాలి లోతులో ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారిన ఆ రోడ్లపై ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆ రోడ్లపై ఉన్న గుంతల్లో పడిపోయి పలువురు వాహనదారులు గాయాలపాలయ్యారన్నారు. ఆ రోడ్లపై ప్రయాణించాలంటే భయపడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ కమలాపూర్ మండలంలోని దేశరాజుపల్లి, కన్నూరు గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి. ఒక వైపు దేశరాజుపల్లికి చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, గ్రామస్తులు, వ్యాపారులు తమ అవసరాల నిమిత్తం కమలాపూర్‌కు, దేశరాజుపల్లి, కన్నూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం అనునిత్యం ఈ మార్గాల ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. అసలే సింగిల్ రోడ్లు.. ఆపై పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారిన ఆ రోడ్లపై ప్రయాణించడానికి వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేయాలని అధికారులను వేడుకుంటున్నారు. సింగిల్ రోడ్లుగా ఉన్న రహదారులను డబుల్ రోడ్లుగా విస్తరించా లని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

20 నుంచి లక్కాకులమ్మ జాతర బ్రహ్మోత్సవాలు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఈనెల 20 నుంచి లక్కాకులమ్మ జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కుక్కముడి ప్రభుదాస్ తెలిపారు. బుధవారం గట్ల నర్సింగాపూర్‌లోని కోదండ రామాలయం వద్ద జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20న మహాగణపతి పూజ, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ, శక్తి హోమం, అఖండ దీపారాధన, బోనం సమర్పణ, 21న అమ్మవారికి అష్టోత్తర సహస్రనామార్చన, అభిషేకం, కుంకుమ పూజలు, ముడుపులు సమర్పించుట, 22న ప్రత్యేక ముడుపులు సమర్పించుట కార్యక్రమాలు నిర్వహించబడుతాయని తెలిపారు. అమ్మవారిని దర్శించుకుంటే సంతాన ప్రాప్తి, కోరిన కోర్కెలు తీర్చుతుందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతర ధర్మకర్తలు మండల రవీందర్, కొమురయ్య, వీరస్వామి, రాజయ్య, కనుకయ్య, ప్రభాకర్, శ్రీధర్, శ్రీనివాస్, సుధాకర్, మధు, శివ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన జాతర ధర్మకర్తలు

వరంగల్‌ను మహానగరంగా తీర్చిదిద్దాలి

- ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

ఆత్మకూరు : 1300 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయ రాజధాని వరంగల్ నగరాన్ని అశాస్త్రీయంగా రెండు ముక్కలుగా చేసి జిల్లాలుగా మార్చడం వల్ల అభివృద్ధి ఆగిపోయిందని, వరంగల్ నగరాన్ని మహానగరంగా తీర్చిదిద్దాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పాలకుల నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధిని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. గత ప్రభుత్వ తప్పులను ప్రస్తుత ప్రభుత్వం సరిదిద్దాలన్నారు. వరంగల్, హనుమకొండ రెండు జిల్లాలను ట్రైసిటీగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రమంతా సమగ్రంగా అభివృద్ధి చెందినప్పుడే రైజింగ్ తెలంగాణాగా ఎదుగుతుందని ప్రజలు నమ్ముతారని అన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పెరిగిన చలివాగు ప్రవాహం



పరకాల : చలివాగు చెక్‌డ్యాం మీదుగా పెరిగిన వరద ప్రవాహం



శాయంపేట: అలుగుపోస్తున్న చలివాగు

పరకాల : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పరకాల చలివాగు చెక్‌డ్యాం మీదుగా వరద ప్రవాహం పెరిగింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వరద ప్రవాహం పెరిగిపోయి వాగు ఒడ్డున ఉన్న పంట పొలాలు, మోటార్లు నీటమునిగాయి. వరదను తిలకించేందుకు పట్టణ ప్రజలు చలివాగు వంతెన వద్దకు చేరుకుంటున్నారు.

అలుగుపోస్తున్న చలివాగు

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారు చలివాగు ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో నిండిపోయి నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులో భారీగా నీరు చేరడంతో బుధవారం 17 ఫీట్ల నీటిమట్టానికి చేరుకుంది. 18 ఫీట్లకు నీటిమట్టం పెరిగితే పెద్ద మత్తడి పోస్తుందని ఏఈ అమృత్ తెలిపారు. ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరడంతో ఖరీఫ్, రబీ సీజన్‌కు సాగునీటి సమస్య తలెత్తదని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చలివాగులో సమృద్ధిగా నీరు ఉంటేనే శాయంపేట, పరకాల, రేగొండ, చిట్యాల మండలాలకు సాగునీరుతో పాటు, శాయంపేట, పరకాల మండలాలకు మిషన్ భగీరథ పథకంలో తాగునీరు అందిస్తుంది.

కనీస వేతనాల జీఓలను విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

హన్మకొండ అర్బన్: 2021 జూన్‌లో విడుదల చేసిన షెడ్యూల్డ్ పరిశ్రమల ఐదు ప్రిలిమినరీ జీఓలను యథాతథంగా గెజిట్ చేయాలని, మిగిలిన 68 షెడ్యూల్డ్ పరిశ్రమల జీఓలను వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనాల జీఓలను అమలు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. అనంతరం, హనుమకొండ డీఆర్‌ఓని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ కనీస వేతనాల సవరణకు సుప్రీం కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకోవాలని, కనీస వేతనాల సలహా మండలి ప్రతిపాదనలు పక్కన పెట్టి కేబినెట్ సబ్ కమిటీ చేస్తున్న కాలయాపనకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన కార్మిక వ్యతిరేక చర్యను వీడి కనీస వేతనాలు పెంచాలని సూచించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బంది పట్టని ప్రభుత్వం

హన్మకొండ: భారీ వర్షాలు కురిసి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. హనుమకొండలోని వరద ప్రభావిత ప్రాంతాలను బుధవారం సందర్శించారు. 4వ డివిజన్‌లోని జ్యోతిబస్ నగర్, 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ వద్ద నాలా, నయీంనగర్ నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు నగరాన్ని వరద ముంచెత్తుతున్నా ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. నగరంలోని బస్తీలు నీట మునిగితే మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొనడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2020లో చరిత్రలో నగరం ఎన్నడూ చూడని వరదలు వస్తే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.250 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. రూ.75 కోట్ల వ్యయంతో సమ్మయ్య నగర్ నాలాను అభివృద్ధి చేశామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్ రావు, జోరిక రమేష్, నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



గురుకుల పాఠశాల ఆవరణలో ఆయిల్ బాల్స్ వేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

దామెర : దోమల నివారణకు ప్రతీ ఒక్కరూ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గుమ్మడి కల్పన సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశీలించారు. పాఠశాల క్రీడా మైదానంలో నిలిచిన నీటిలో గ్రామ పంచాయతీ సిబ్బందిచే ఆయిల్ బాల్స్ వేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షంద్వారా నిలిచిన నీటిలో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతాయని అన్నారు. జ్వరం సోకితే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకొని, డాక్టర్లను వెంటనే సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సమ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సంగెం : భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం సంగెం మండలంలోని కాట్రపల్లి– వెంకటాపూర్ గ్రామాల మధ్య గల బ్రిడ్జి ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక రహదారి నిర్మాణం, శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అవసరం మేరకే కొనుగోలు చేయాలి

- ఏడీఏ ఆదిరెడ్డి



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ ఆదిరెడ్డి, ఏఓ సునీల్‌కుమార్

ఐనవోలు : ప్రస్తుత పంట అవసరం మేరకే రైతులు యూరియా బస్తాలు కొనుగోలు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) దోమ ఆదిరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఎఫ్ఎస్‌సీఎస్ నందనం, ఏఆర్ఎస్‌కే పంథిని, లక్ష్మీ ఫర్టిలైజర్ డిపో ఐనవోలులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను రిజిస్టర్‌తో పాటు గోదాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 120–130 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పంటల విస్తీర్ణానికి తగ్గట్లు ఎరువుల స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. మార్కెట్‌లో యూరియా నిల్వలు లేవని ప్రచారంతో అవసరం లేకున్నా ముందస్తుగా ఎక్కువ యూరియా బస్తాలు రైతులు కొనుగోలు చేసి ఇంటివద్ద నిల్వలు చేసుకుంటున్నారన్నారు. ఎక్కువ మోతాదులో యూరియాను పంటలకు వాడకూడదన్నారు. పత్తి, మొక్కజొన్న పంటలకుపై నానో డీఏపీ, యూరియాను పిచికారి చేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చని తెలియజేశారు. ఆయన వెంట ఏఓ సునీల్ కుమార్ ఉన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



కమలాపూర్ : మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

- సీఐ హరికృష్ణ

కమలాపూర్ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. నిషా ముక్తి భారత్ ప్రచార అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మీ ఆరోగ్యాన్ని మీ కుటుంబాలను సంరక్షించుకోవాలని సూచించారు. గంజాయి సాగు, విక్రయాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల రవాణా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై మధు, పోలీస్ సిబ్బంది, ప్రిన్సిపాల్, పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

పరకాల : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.మహిపాల్‌రెడ్డి అన్నారు. నషముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యనిర్మూలనపై అవగాహన సదస్సు, విద్యార్థులచే ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచిమార్గంలో ప్రయాణించాలని కోరారు. తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.డీ సర్దార్, స్టాఫ్ సెక్రటరీ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : యువకులు మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని స్థానిక సీఐ రంజిత్ రావు అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వ్యాపారస్తులు, ఆటోడ్రైవర్లు, యువకులతో మాదక ద్రవ్యాలను నిర్మించాలని సీఐ ఎస్సై జక్కుల పరమేష్‌తో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రంజిత్‌రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మహమ్మారికి విద్యార్థులు, యువకులు బానిసకాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను కని పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యా పారస్తులు, ఆటో డ్రైవర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శాయంపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ రంజిత్ రావు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దామెర : సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. స్థానిక శ్రీహర్ష పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచితులు ఫోన్ చేసి అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకూడదని అన్నారు. బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీలు ఎవరితో పంచుకోకూడదని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఇచ్చే ఆఫర్లను నమ్మి మోసపోకూడదని వెల్లడించారు. విద్యార్థి దశ నుంచే ఎంచుకున్న లక్ష్యం కోసం శ్రమించాలని సూచించారు. కష్టపడి చదువుకొని ప్రయోజకులు కావాలని హితవు పలికారు. విద్యార్థులు సెల్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు యాకయ్య, రమేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



దామెర : బోనాలతో వస్తున్న మహిళలు

దామెర : మండలకేంద్రంలో పోచమ్మ బోనాలను బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన పాత్రల్లో, కుండల్లో బోనాన్ని తీసుకొని బయలుదేరారు. డప్పుచప్పుళ్ల మధ్య, శివసత్తుల, పోతరాజుల విన్యాసాల మధ్య పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పించారు. నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, దూపదీపం, టెంకాయలు సమర్పించారు. జంతుబలి నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గుడి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తాటికొండ భద్రయ్య, రాజేందర్, శ్యామ్‌కుమార్, అశోక్, శంకర్, రమణాచారి, కృష్ణమూర్తి, రవి, శంకోజు రాజేందర్, భిక్షపతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి చీర, సారె సమర్పించి, ప్రసాదాలు నివేదన చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

శాయంపేట : మండలంలోని సూర్యానాయక్ తండా గ్రామంలో బుధవారం గ్రామస్తులు వైభవంగా పోచమ్మ బోనాల పండుగను నిర్వహించుకున్నారు. పాడి పంటలను, పశువులను, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తీన్మార్ జయ్, అజిత్ కుమార్, సదర్ లాల్, ప్రతాప్, భాస్కర్, తిరుపతి, కిరణ్, జీవన్, సునీల్, అనిల్, అమిత్, రాజు, జగన్, నెహ్రూ, రవీందర్, శీను, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : బోనాలతో వస్తున్న మహిళలు



శాయంపేట : బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పేదల ఇళ్లను కూల్చడం సరికాదు



ఇళ్లను పరిశీలిస్తున్న రమేశ్

గీసుకొండ : పేదలు నిలువ నీడ కోసం వేసుకున్న ఇళ్లు, గుడిసెలను కూల్చడం సరికాదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. బుధవారం గ్రేటర్‌వరంగల్ మొగిలిచర్ల శివారులోని పోగుల అగయ్యనగర్‌లో కూల్చివేసిన ఇళ్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదల పక్షాన ఉండాలని, రియల్టర్లకు అనుకూలంగా ఉండవద్దన్నారు. ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల ఇంటి స్థలాలకు ప్రభుత్వం పట్టాలిచ్చి ఆదుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, నాయకులు గనిపాక రేణుక, సదానందం, చంద్రమౌళి, అరుణ్, మరియ, కుమారస్వామి, శ్రీకాంత్, రవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.